క్లుప్తంగా

శారదమాత ఉత్సవాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

భైంసాటౌన్: పట్టణంలో శారదమాత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు చేశారు. బ్రాహ్మణగల్లిలోని రాధాకృష్ణ భవన్‌తోపాటు ఆర్యవైశ్య సంఘ భవనంలో అమ్మవారికి హారతి, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండలకేంద్రంలోని భవిత విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 21 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్టు శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఐఆర్‌టీ భూమన్న, రాము సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరి రిమాండ్

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ శివారులో ఇటీవల అటవీభూమి ఆక్రమణకు యత్నించిన బోసు భూమన్నపై కేసు నమోదు చేసి మంగళవారం నిర్మల్ కోర్టుకు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో కిరణ్ తెలిపారు. ఈమేరకు అటవీ భూమిని దున్నిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి.. భూమన్నను రిమాండ్ చేశామన్నారు. అటవీ భూములను దున్నితే వాహనాలను సీజ్ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రవీందర్, ఎఫ్‌బీవో ముత్తన్న ఉన్నారు.

మెరిట్ జాబితా విడుదల

నర్సాపూర్(జి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కేజీబీవీలో హెడ్ కుక్ (1), అసిస్టెంట్ కుక్ (4) పోస్టులకు గతంలో దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి మంగళవారం తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేసి తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఆర్సీ కార్యాలయాలలోపాటు కేజీబీవీ నోటీస్ బోర్డులో ఉంచినట్లు ఎంఈఓ కిషన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే బుధవారం సాయంత్రంలోగా తెలియజేయాలని పేర్కొన్నారు.

కల్వర్టు వద్ద మరమ్మతులు


గుంత పూడుస్తున్న పొక్లెయిన్

సాక్షి ఎఫెక్ట్..

కుంటాల: మండలంలోని ఓలా నుంచి లింబా(కె) వెళ్లే మార్గంలో కల్వర్టు వద్ద గుంత ఏర్పడగా దీనిపై ఈనెల 12న సాక్షిలో 'పొంచి ఉన్న ముప్పు' శీర్షికన కథనం ప్రచురితమైంది. గ్రామస్తులు స్పందించి పొక్లెయిన్‌తో గుంతను పూడ్చి మరమ్మతులు చేయించారు.

బతుకమ్మల నిమజ్జనం


బహుమతులు అందిస్తున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం బతుకమ్మ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల వద్ద మహిళలు ఆడిపాడారు. పట్టణంలోని విద్యానగర్‌లో ఉత్తమ బతుకమ్మలను పేర్చిన మహిళలకు పన్నెల గంగన్న కుమారుడు జనార్ధన్ స్మారకార్థం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాలనీవాసులు బహుమతులు ప్రదానం చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్యాయత్నం


యువకుడితో బ్లూకోల్ట్స్ సిబ్బంది

కడెం: భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాసాయిపేట్ గ్రామానికి చెందిన మధ్యల ప్రవీణ్ మంగళవారం మద్యం సేవించి కడెం ప్రాజెక్టులో దూకేందుకు యత్నిస్తుండగా గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. స్పందించిన బ్లూకోల్ట్స్ సిబ్బంది అర్షద్, జగ్మల్ హుటాహుటిన ప్రాజెక్ట్ వద్దకు చేరుకుని యువకుడి ప్రాణాలు కాపాడారు.

మొగులు.. గుబులు

- జిల్లా రైతులను భయపెడుతున్న మబ్బులు
- రెండు రోజులుగా అక్కడక్కడ చిరుజల్లులు


లోకేశ్వరంలో రోడ్డుపై ఆరబెట్టిన పంట


రాయపూర్‌కాండ్లీలో పంటలపై కప్పిన టార్పాలిన్లు

లోకేశ్వరం: జిల్లాలో రైతుల పరిస్థితి ముందు చూస్తే నుయ్యి..వెనుక చూస్తే గొయ్యిలా తయారైంది. ఒకవైపు పంట కోతలు.. మరోవైపు చేతికి వచ్చిన ధాన్యం కల్లాల్లో ఆరబెడుతున్నారు. ఆకాశం మేఘావృతమై ఉండటం.. అక్కడక్కడా కురుస్తున్న చిరుజల్లులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్న, సోయా, వరి పంటలను కాపాడుకునేందుకు కర్షకులు నానావస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల పంటల కోతలు పూర్తవగా.. మరికొన్ని చోట్ల చేతికి వచ్చే దశలో ఉన్నాయి. వానలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు.

లోకేశ్వరం మండలంలో..

వడగండ్ల వర్షం పడితే గింజ కూడా చేతికి రాదనే ఉద్దేశంతో కొన్నిచోట్ల పంటలను ముందుగానే కోయిస్తున్నారు. బురద ఉన్న చోట దిగబడుతుండడంతో ఎక్కువ వ్యయమైనా చైన్‌మిషన్లను పెట్టి సోయా, వరి పంటలను కోయిస్తున్నారు.

లోకేశ్వరం మండలంలో వానాకాలంలో వరి 14 వేల ఎకరాలు, మొక్కజొన్న ఆరు వేల ఎకరాలు, సోయా పంటలను మూడు వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొంత నష్టం వాటిల్లింది.. మళ్లీ వాతావరణంలో మార్పులు వస్తుండటంతో ఏం చేయాలో తోచడం లేదని రైతులు వాపోతున్నారు.

పచ్చిగా ఉన్నా కోయించిన..



20 రోజుల కిందట కురిసిన వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు మబ్బులు భయపెడుతున్నాయి. రాళ్లవాన పడితే గింజ కూడా చేతికి రాదనే ఉద్దేశంతో సోయా పంట పచ్చిగా ఉండగానే కోయించిన.

– దయాకర్, రాయపూర్‌కాండ్లీ

పంటలు దెబ్బతిన్నాయి



వారం రోజులుగా వాతావరణంలో మార్పు వస్తుండటంతో భయాందోళన చెందుతున్నాం. వరి, మొక్కజొన్న, సోయా పంటలు గాలివానలకు నేలకొరిగి దెబ్బ తిన్నాయి. కొందరు పంటలు కోసి కల్లాల్లో ఆరబెడుతున్నారు.

– మామిడి సంజీవ్‌రెడ్డి, ధర్మోర

రైతులు పంటను దళారులకు విక్రయించొద్దు

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: రైతులు తమ పంటను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకొని మద్దతు ధర పొందాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అబ్దుల్లాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం డబ్బులను నేరుగా రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.2320, బీ గ్రేడ్‌కు రూ.2300 చెల్లించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 17 తేమ శాతం ఉండేలా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.


అబ్దుల్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, నాయకులు భాస్కర్, సాయన్న, జయసాగర్‌రావు, గంగాధర్, సుదర్శన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, రత్నాకర్‌రావు, ప్రేమ్‌నాథ్‌రెడ్డి ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.5 కోట్లు మంజూరైనట్లు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాసర మండలంలోని ఓని గ్రామం నుంచి బాసర వరకు రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు, నర్సాపూర్ మండలంలోని అంబకంటి నుంచి నందన్ వరకు రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు, భైంసా మండలంలోని వానల్‌పాడ్ నుంచి పేండ్‌పెల్లి వరకు రోడ్డు కోసం రూ.కోటి నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

రెండోరోజుకు ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్

నిర్మల్‌రూరల్: పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన బంద్ రెండోరోజుకు చేరింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘ నాయకుడు నరేశ్‌గౌడ్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌ల విషయం మూడేళ్లుగా విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం కాలేజీలు నడపలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్‌లను సకాలంలో విడుదల చేసి గ్రామీణ పేద విద్యార్థులను, ప్రైవేటు లెక్చరర్లను ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ రత్నకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల యజమానులు వెంకటరెడ్డి, సాయిలు, అఖిలేశ్ కుమార్, వెంకటేశ్‌గౌడ్, విఠల్‌రావు, బద్రి ప్రవీణ్, శ్రీనివాస్ గౌడ్, నర్సారెడ్డి, లక్ష్మీనరసయ్య, శ్రీధర్, శ్రీనివాస్, రవి, హైమద్ బాషా పాల్గొన్నారు.


నిర్మల్‌లో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కళాశాలల యజమానులు, అధ్యాపకులు

ఖానాపూర్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘాల పిలుపు మేరకు పట్టణంలోని కళాశాలలు మంగళవారం కూడా బంద్ పాటించాయి. కళాశాలల ఎదుట ఫెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా రావాల్సిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉండడంతో అధ్యాపకుల వేతనాలు, భవనాల అద్దెలు, కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్‌రెడ్డి తెలిపారు. మంత్రులు, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చిన స్పందనలేకుండా పోయిందన్నారు. ఆర్థిక సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

పెన్షన్ల పెంపు హామీ అమలు చేయాలి

ఖానాపూర్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు సామాజిక పెన్షన్ల పెంపు హామీని అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు తొడసం శంభు, సంఘం జిల్లా కార్యదర్శి అడిదెల రాజేశ్ కోరారు. పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సంఘం రాష్ట్ర నాలుగో మహాసభ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈనెల 25, 27 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెన్షన్లు కూడా సకాలంలో పంపిణీ చేయడం లేదని ఆరోపించారు.

సంక్షిప్త వార్తలు

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నర్సాపూర్(జి): ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. అవినీతిని పోషిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదించడమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన సాగుతుందని మండిపడ్డారు. బీజేపీ మండల అధ్యక్షుడు అర్జున్ ఠాకూర్, బొప్పారం సాయన్న, సూర నారాయణ, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని గ్రామంలో మంగళవారం 242 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి షేక్ ముక్తార్ పేర్కొన్నారు. గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నవంబర్ 14 వరకు కొనసాగుతుందని.. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సిబ్బంది రాజేశ్వర్, పవన్ సందీప్, శేఖర్ పాల్గొన్నారు.

రాణాపూర్‌లో జాతర

నిర్మల్‌రూరల్: మండలంలోని రాణాపూర్‌లో మంగళవారం తుల్జా భవాని జాతర కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి రాథోడ్ మహేందర్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం జాతర ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. జాతర సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించగా మాదాపూర్ జట్టు విజేతగా నిలిచింది.

సన్మానం

సోన్: బదిలీల్లో భాగంగా సోన్ విద్యుత్ ఏఈ శ్రీనివాస్.. దస్తురాబాద్ మండలానికి బదిలీ అయ్యారు. మంగళవారం ఏఈ శ్రీనివాస్‌ను సోన్‌లోని తన కార్యాలయంలో సిబ్బంది సన్మానించారు. అనంతరం బదిలీపై వచ్చిన లైన్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, లైన్‌మెన్ చరణ్‌దాస్, గంగాధర్, మోహన్‌కు స్వాగతం పలికారు.

ముధోల్‌లో..

ముధోల్: ఇటీవల ఎన్నికైన పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొక్కుల గంగాధర్‌ను మంగళవారం ముధోల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు గీత, కవిత, స్వర్ణలత, నీరజ, అంజుమ్‌పర్వీన్, షాహేద్‌పర్విన్ తదితరులున్నారు.

దస్తురాబాద్ విద్యుత్ ఏఈగా శ్రీనివాస్

దస్తురాబాద్: మండల విద్యుత్ ఏఈగా తుమ్మల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన ఏఈ కొట్టె శ్రీనివాస్.. బదిలీపై మంచిర్యాల జిల్లా చెన్నూర్ సబ్ డివిజన్‌లోని కొమిరెకు వెళ్లారు. సోన్ మండలంలో ఏఈగా పని చేసే తుమ్మల శ్రీనివాస్ బదిలీపై దస్తురాబాద్ రానున్నారు. దస్తురాబాద్, బుట్టాపూర్ లైన్‌ఇన్‌స్పెక్టర్లు చరణ్‌దాస్, సదానందంకు సోన్, కడెం మండలాలకు బదిలీ కాగా.. సిబ్బంది వారిని సన్మానించారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి

ముధోల్: నవంబర్ 2021లోగా డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల ఇన్‌చార్జి కందం సంతోష్‌పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకునే వారి పేర్లతో జాబితా రూపొందించారు. ఓటు నమోదుకు డిగ్రీ మెమో, ఆధార్ జిరాక్స్‌లతోపాటు పాస్ ఫొటోలను తహసీల్దార్ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై భాస్కరాచారి హెచ్చరించారు. పండుగ వేళ పలువురు కుంటాల ఉన్నత పాఠశాలలో మద్యం తాగి విద్యుత్ పరికరాలను ధ్వంసం చేశారు. దీనిపై ఈనెల 14న మందుబాబులకు అడ్డాగా పాఠశాల శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. సోమవారం రాత్రి ఎస్సై పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

చెక్కులు అందజేత

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ, తిమ్మాపూర్ (జి) గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను చెన్న మహేశ్, బీజేపీ నాయకులు వినోద్ రెడ్డి మంగళవారం అందజేశారు. కాల్వ సంతోష్‌కు రూ.60వేలు, కాల్వ భోజవ్వ రూ.18 వేలు, కాసారం భూమన్న రూ.54 వేలు, సుశీల రూ.19,500 విలువైన చెక్కులు అందజేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రామారావుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన కాంబ్లె దేవిదాస్ (38) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. దేవిదాస్ కొన్నేళ్లుగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. సోమవారం అతని భార్య మీరాబాయితో గొడవపడి డబ్బులు తీసుకొని బయటకు వెళ్లాడు. మళ్లీ ఇంటికి వచ్చి ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. మంగళవారం కుటుంబసభ్యులు గమనించి భైంసా ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నర్సాపూర్(జి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో తిరుపతిరెడ్డి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిబ్బంది చేత నిల్వనీటిని పారబోయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్, ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతులు శుభ్రంగా కడుక్కోవాలి


శుభ్రం చేసుకోవాలని చెబుతున్న నాగమణి

సారంగాపూర్: రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తమ చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి అన్నారు. మంగళవారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను పురస్కరించుకొని మండలంలోని చించోలి(బి) రెండో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చేతులను శుభ్రం చేసుకునే విధానం వివరించారు. ఆమె మాట్లాడుతూ డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం చేతుల పరిశుభ్రత నిబంధనలను 40శాతం మాత్రమే పాటిస్తున్నారని అన్నారు. దీనిని మెరుగుపరిస్తే వైద్యకేంద్రాల్లో 30శాతం వరకు రోగాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ సూపర్‌వైజర్ విజయగౌరి, అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, హెల్పర్ పద్మ తదితరులు ఉన్నారు.

'ఉపాధి' గ్రామసభలు

తానూరు: మండలంలోని వాడోన, నంద్‌గాం, బెంబర గ్రామాల్లో మంగళవారం 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల గుర్తింపునకు, ప్రణాళికల తయారీకి గ్రామసభలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకునే అర్హులందరికీ జాబ్‌కార్డు అందిస్తామని ఎంపీడీవో అబ్దుల్ సమద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో గంగాధర్, టీఏ ప్రసాద్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సారంగపూర్ మండలంలో..

సారంగపూర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులు, లేబర్ బడ్జెట్ ఆమోదం కోసం బుధవారం నుంచి మండలంలోని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఈజీఎస్ ఏపీఓ లక్ష్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామసభల తేదీల వివరాలు సంబంధిత పంచాయతీ కార్యాలయాల్లో పొందుపరిచామని పేర్కొన్నారు. కూలీలు, రైతులు, గ్రామస్తులు హాజరై ప్రణాళికల తయారీలో భాగస్వాములు కావాలని కోరారు.

'నిర్వాసితులకు అండగా ఉంటాం'

- సీపీఐ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమయ్య



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌రూరల్: భైంసా మండలం గుండేగాం గ్రామం ముంపునకు గురై పదేళ్లు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్వాసితులకు నష్టపరిహారం అందించలేదని.. గ్రామస్తులకు న్యాయం జరిగేలా సీపీఐ తరపున అండగా ఉంటామని సీపీఐ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజరపు భూమయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం గుండేగాం గ్రామం కోసం రూ.94 కోట్లు కేటాయించినా రూ.61 కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. కానీ నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా వర్షాకాలంలో ప్రజలు అంటువ్యాధులు, వైరస్‌ల బారినపడి ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. గుండేగాం గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దిలావర్‌పూర్ మండలంలో తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, కార్యదర్శి ఉపాలి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాష్ట్రపాల్, లక్ష్మణ్ వాడేకర్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం


నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


కడెం మండలం లింగాపూర్‌లో..


కుంటాలలో..

నిర్మల్‌రూరల్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శనీయమని డాక్టర్ అబ్దుల్ కలామ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్ గామ్ చౌరస్తాలో మంగళవారం అబ్దుల్ కలామ్ జయంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈద్ గామ్ చౌరస్తా వద్ద కలాం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. టీఎన్‌జీవో అధ్యక్షుడు ప్రభాకర్, కౌన్సిలర్లు ఇమ్రాన్‌ఉల్లా, ముజాహిద్ అలీ, ఉపాధ్యక్షులు మహమ్మద్ అన్వర్, షబ్బీర్ అహ్మద్, కార్యదర్శులు మహమ్మద్ మసూద్, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

కడెం: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని లక్ష్య సాధనకు ముందుకు సాగాలని పలువురు పేర్కొన్నారు. మండలంలోని లింగాపూర్‌లో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. మహమ్మద్ సలీం, తరిశంకర్, అబ్దుల్ వహీద్, లక్ష్మణ్, బాబర్ ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా యువకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాటి శివ, జక్కుల గజేందర్, సాగర్, వినోద్, కాశీరాం గజేందర్, పవన్, రాజు, చిన్నయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న ఎస్సై భాస్కరాచారి

కుంటాల: దొంగతనాలు జరగకుండా గ్రామాల్లో దాతల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సీహెచ్.భాస్కరాచారి సూచించారు. మంగళవారం మండలంలోని కల్లూరులో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. వ్యాపారులు తప్పనిసరిగా తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇల్లు విడిచి వేరే ఊరికి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనుమానితులు కన్పిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల కార్యవర్గం

కుంటాల: మండలంలోని అందాకూర్ గ్రామంలో ఎస్సీ(మాల) రిజర్వేషన్ వ్యతిరేక పోరాట కమిటీ మండల కార్యవర్గాన్ని మంగళవారం తాలూకా ఉపాధ్యక్షులు దేవదాస్ హెగ్డే, మగ్గిడి దిగంబర్, కార్యదర్శి ముద్ద అశోక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ మండల కన్వీనర్‌గా ప్యాటిమ్ సాయికుమార్, ఉపాధ్యక్షులుగా శీలం రవిప్రసాద్, మట్ట కృష్ణ, ముద్దం భోజన్న, శీలం సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా బాస గణేశ్, కార్యదర్శులుగా మట్ట కరుణాకర్, గణేశ్, జగదీశ్వర్, సాయన్న, కోశాధికారిగా వాడేకర్ గంగాధర్, సలహాదారులుగా పరుశురాం, లక్ష్మణ్, గౌరవాధ్యక్షులుగా చిన్నయ్య, వినోద్, సభ్యులుగా రాజు, రతన్, సురేశ్, దిగంబర్, గంగాధర్ ఎన్నికయ్యారు.